రంగారెడ్డి । వికారాబాద్ । మేడ్చల్
వార్త

## తీవ్ర మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

**చేవెళ్ల, జూన్ 13, ప్రభాతవార్త:**
చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇక్కారెడ్డి గూడ గ్రామంలో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వెలుగులోకి వచ్చింది. వికారాబాద్ జిల్లా, పెద్దేముల్ మండలం, తట్టేపల్లి గ్రామానికి చెందిన ప్రశాంత్ (32) వృత్తిరీత్యా కారు డ్రైవర్. ఇక్కారెడ్డిగూడ గ్రామంలో తన భార్య రేణుకతో కలిసి నివాసం ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఉదయం సుమారు 07:30 గంటలకు ప్రశాంత్ మరణించిన విషయాన్ని కుటుంబ సభ్యులు చంద్రప్పకు తెలియజేయగా, ఆయన వెంటనే అక్కడికి చేరుకున్నారు. అనంతరం చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి, చేవెళ్లకు తరలించగా, ప్రశాంత్ ఆసుపత్రిలో మృతిచెందాడు. వివరాలలోకి వెళ్తే, ప్రశాంత్ వేరే అమ్మాయితో అక్రమసంబంధం పెట్టుకొని ఫోన్‌లో మాట్లాడుతుండగా ఆ విషయంలో రేణుక, ప్రశాంత్‌ని నిలదీసిందని, అప్పుడు ప్రశాంత్ మనస్తాపానికి గురై తన నివాసంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. ఈ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

## ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**కేశంపేట, జూన్ 13, ప్రభాతవార్త:**
కేశంపేట మండల పరిధిలోని సంగెం గ్రామానికి చెందిన కుమ్మరి యాదగిరి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. కేశంపేట సిఐ నరహరి తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్మరి యాదగిరి కొన్ని రోజుల క్రితం యాక్సిడెంట్ జరగడంతో తలకు బలమైన గాయమై మతిస్థిమితం సరిగా ఉండేది కాదని, అప్పటినుండి ఎవరికీ చెప్పకుండా ఎక్కడపడితే అక్కడికి వెళ్లి, మళ్లీ తిరిగి ఇంటికి వస్తూ ఉండేవాడని, శనివారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పైకప్పుకు ఉన్న సీకుకు తాడుతో ఉరి వేసుకొని మృతిచెంది ఉన్నాడు. ఈ విషయమై మృతుడి సోదరుడైన కుమ్మరి నరసింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నరహరి తెలిపారు.

## కబ్జాకోరల నుండి దళితుల భూములు విడిపించండి


ఎంపి లక్ష్మణ్‌ను కలిసిన బాధితుడు సత్యనారాయణ తదితరులు

**ఘట్‌కేసర్, జూన్ 13, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ మర్రిపల్లిగూడలోని దళితుల భూములను ఆక్రమణ దారుల నుంచి విడిపించి కోర్టు ఆదేశాల ప్రకారం పట్టాదారు పాసుపుస్తకాలు జారీచేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధితుడు చిలుగూరి సత్యనారాయణ శనివారం రాజ్యసభ సభ్యులు, బిజెపి పార్లమెంటరీ బోర్డు సభ్యులు డాక్టర్ కోవ లక్ష్మణ్‌ను కోరారు. మర్రిపల్లిగూడ సర్వేనంబర్ 13లో 3-13ఎకరాల భూమి వారసత్వంగా తాతలకాలం నాటి నుంచి సాగు చేసుకుంటున్నామని తెలిపారు. ఈభూమికి సంబంధించి ఓఆర్‌సి కూడా ఉందని, తామే కబ్జాలో ఉన్నామని, కొందరు తమపై దౌర్జన్యం చేసి, భూమిలోకి ప్రవేశించి, బోర్డును తొలగించి, భూమిని దున్నుతున్నారని దీనిపై గత మే 27న ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్, జూన్ 3న మల్కాజ్‌గిరి సిపికి ఫిర్యాదు చేశామని తెలిపారు. గతంలో ఢిల్లీలోని జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌లో కేసు నడుస్తుందని, రాష్ట్ర ఉన్నతన్యాయస్థానంలో కేసువేయగా, స్టే ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. హైకోర్టు ఉత్తర్వులు తమకు అనుకూలంగా ఉన్నప్పటికీ ఆక్రమణదారులు తమను బెదిరించి భూమిలాక్కునే ప్రయత్నం చేస్తున్నారని వారి నుంచి తమకు ప్రాణభయం ఉందని తమ భూమిని వారిని నుంచి విడిపించి తమకు హక్కులు కల్పించాలని విజ్ఞప్తిచేశారు. ఈమేరకు తెలంగాణ రాష్ట్రం నుంచి జాతీయ ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్‌తో ఎంపి లక్ష్మణ్ మాట్లాడి కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా అపాయింట్‌మెంట్ తీసుకొని బాధితుల ఫిర్యాదు స్వీకరించి తగిన న్యాయం చేయాలని కోరారు.

## ఉద్యోగుల సంక్షేమం కోసం యాజమాన్యం కృషి

-ఆర్టీసీ డిఎం నమ్రత


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న డిఎం నమ్రత

**వికారాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:**
ఉద్యోగుల సంక్షేమం కోసం యాజమాన్యం కృషి చేస్తుందని వికారాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ నమ్రత తెలిపారు. శనివారం వికారాబాద్ ఆర్టీసీ డిపోలో ఉద్యోగులతో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా డిఎం మాట్లాడుతూ, ఇటీవల జరిగిన ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రభుత్వం, యాజమాన్యంతో కుదిరిన ఒప్పందంలో భాగంగా 2021 వేతనసవరణ జూన్ మాసంలోనే అమలు చేయడం జరుగుతుందని, అందుకు అనుగుణంగా జూలై 1వ తేదీ నుండి ఉద్యోగులు కొత్త వేతనాలు అందుకోనున్నారని ఆమె తెలిపారు. ఆర్టీసీలో గుర్తింపు యూనియన్ ఎన్నికలకు సంబంధించి లేబర్ కమిషనర్ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియ త్వరలో ప్రారంభం కానుందని, ఎన్నికల షెడ్యూల్ త్వరలో వెలువడుతుందని వెల్లడించారు. గుర్తింపు యూనియన్ ఎన్నికల అనంతరం, గుర్తింపు పొందిన సంఘం, డైరెక్టర్, యాజమాన్యంతో కలిసి కమిటీ వేసి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను ప్రారంభిస్తామని డిపో మేనేజర్ స్పష్టంచేశారు. ఉద్యోగుల సంక్షేమం కోసం యాజమాన్యం కృషి చేస్తోందని, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని డిఎం నమ్రత భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎఫ్ సురేందర్, సెక్యూరిటీ ఇంచార్జ్ నరసింహులు, డిసి పెంటయ్యనాయక్, ఎడిసిలు మనోహర్, ఎల్లయ్య, జివికెరెడ్డి, వికారాబాద్ ఆర్టీసీ డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

## భూవివాదంలో నిందితులు అరెస్ట్


చీర్యాల భూ వివాదానికి కారణమైన నిందితులను అరెస్టు చేసిన కీసర పోలీసులు

**కీసర, జూన్ 13, ప్రభాతవార్త:**
చీర్యాల గ్రామ భూవివాదానికి సంబంధించిన హత్యాయత్నం కేసులో 14మంది నిందితులను అరెస్టుచేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు సిఐ అర్కపల్లి ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చీర్యాల గ్రామ సర్వే నంబరు 156లో భూమి వివాదానికి సంబందించి నమోదైన హత్యాయత్నం కేసులో ప్రధాన నిందితులు ఏ1 పల్లె భద్రారెడ్డి, ఏ2 బొల్లంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఏ3 పంజా సంజయ్‌కుమార్‌లను ఇప్పటికే రిమాండ్‌కి పంపించగా, తదుపరి దర్యాప్తులో భాగంగా ఘటనలో ప్రత్యక్షంగా పాల్గొన్న 14మంది నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కి పంపించడం జరిగిందన్నారు. నిందితులు భూవివాద నేపథ్యంలో చీర్యాల గ్రామంలోని వివాదాస్పద భూమి వద్దకు చేరుకుని అక్కడ విధులు నిర్వహిస్తున్న వాచ్‌మెన్ గోదుగు సాయికుమార్‌పై అలాగే అతనిని రక్షించేందుకు వచ్చిన బాధితులు, సాక్షులపై ఇనుప రాడ్లు, హ్యామర్లు, కర్రలు, రాళ్లతో దాడిచేసి తీవ్రగాయాలు కలిగించినట్లు దర్యాప్తులో నిర్ధారణ అయిందన్నారు. ఈ ఘటనలో గాయపడిన బాధితుల వాంగ్మూలాలు, ప్రత్యక్ష సాక్షుల ప్రకటనలు స్వాధీనం చేసుకున్న వస్తువులు, ఇతర సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితుల ప్రమేయం బయటపడిందన్నారు. అనంతరం ప్రత్యేక పోలీసు బృందాలు నిందితులను గుర్తించి అరెస్టుచేసి కోర్టుముందు హాజరు పరచడం జరిగిందన్నారు. ఈ కేసులో మరికొంతమంది నిందితులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈ కేసులో సమగ్ర దర్యాప్తు నిర్వహించిన జవహర్‌నగర్ ఎసిపి చక్రపాణి, కీసర సిఐ ఆంజనేయులు, దర్యాప్తు అధికారి శ్రీనివాస్‌రెడ్డి, కీసర పోలీసు సిబ్బందిని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీధర్ అభినందించారు.

**ప్రజలకు సిఐ విజ్ఞప్తి:**
ఎటువంటి సివిల్ లేదా భూవివాదాలైనా కోర్టులు లేదా రెవెన్యూ చట్టాల పరిధిలోనే పరిష్కరించుకోవాలన్నారు. భూవివాదాల విషయంలో అసాంఘికశక్తుల సహాయం తీసుకోవడం, రౌడీలను సమీకరించి ప్రత్యర్థివర్గాలపై దాడులకు పాల్పడటం వంటి చర్యలను పోలీసులు తీవ్రంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటారన్నారు. ముఖ్యంగా భూమి యాజమాన్యంతో ఎటువంటి సంబందం లేకుండా డబ్బుకు ఆశపడి ఇటువంటి గొడవల్లో పాల్గొనే వ్యక్తులు చట్టపరమైన పరిణామాలను ఎదుర్కొని జైలుపాలయ్యే అవకాశం ఉందన్నారు. అదనంగా వారిపై రౌడీషీట్లు కూడా పెడతామన్నారు.

# మొండికేసిన వంతెన పనులు..!

**ధారూర్, జూన్ 13, ప్రభాతవార్త:**
అధికారులు మారారు.. ప్రభుత్వాలు మారాయి.. కాంట్రాక్టర్లు మారారు.. కాని ధారూర్ మండల పరిధిలోని దోర్నాల-ధారూర్‌స్టేషన్ గ్రామాలమధ్య ఉన్న ఆ వంతెన రాత మాత్రం మారడంలేదు. ఎన్నేళ్లు గడుస్తున్నా, అప్రోచ్‌రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో సుమారు 30నుండి 40గ్రామాల ప్రజలు తీవ్ర నరకయాతన అనుభవిస్తున్నారు.

**తొమ్మిదేళ్లుగా సాగుతున్న వంతెన పురాణం...!**
ఈ వంతెనకు ఒక పెద్ద చరిత్రే ఉంది. 2016లో కురిసిన భారీవర్షాలకు ఈ వంతెన కొట్టుకుపోయింది. దీంతో 2017లో అప్పటి ప్రభుత్వం రూ. 4.70కోట్లు మంజూరుచేసింది. నిధులైతే మంజూరయ్యాయి కాని, పనులుమాత్రం నత్తనడకన సాగాయి. ముగ్గురు, నలుగురు కాంట్రాక్టర్లు మారిన తర్వాత ఎట్టకేలకు 2025లో వంతెన పనులు ఒక కొలిక్కివచ్చాయి. అయితే, నిధులు సరిపోకపోవడంతో ప్రస్తుత కాంగ్రెస్‌ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని మరో రూ.2.60కోట్లు మంజూరు చేయించారు.

**నిధులున్నా కదలని అప్రోచ్ రోడ్డు...**
చేతిలో నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ అప్రోచ్ రోడ్డు పనులుమాత్రం అడుగు ముందుకుపడటం లేదు. అధికారులు చెప్పున్న మాటలను కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదో.. లేక అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో తెలియదు కాని, పనులు మాత్రం మందకొడిగా సాగుతున్నాయి. త్వరలోనే వర్షాకాలం రాబోతుండటంతో, అంతకంటే ముందే పనులు పూర్తిచేస్తామని అధికారులు చెబుతున్న మాటలకు, అక్కడ క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులకు అస్సలు పొంతనలేదు. ఏ ముహూర్తాన ఈ వంతెన పనులు ప్రారంభించారో కాని.. దీనికి మోక్షం దొరకడం లేదని, ఏళ్లు గడుస్తున్నా, మా కష్టాలు తీరడంలేదని స్థానికప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**30కి పైగా గ్రామాల ప్రజల ఇక్కట్లు...**
ఈ వంతెన ధారూర్ మండల కేంద్రానికి రావడానికి అత్యంత కీలకమైన ప్రధాన మార్గం. దీనిపైనుంచే నాగారం, మైలారం, మోమిన్‌కూర్దు, రాజాపూర్, అంపల్లి, గురుదోట్ల, యాలాల మండలంలోని రాస్నం, పగిడియల్, సంగయ్యపల్లి, ఇలా దాదాపు 30నుండి 40గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. వంతెన అప్రోచ్‌రోడ్డు అధ్వాన్నంగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈరోడ్డుపై ప్రయాణించడం వల్ల వాహనాలు తరచూ రిపేర్లకు వస్తున్నాయని, జేబులకు చిల్లులు పడుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. వర్షాకాలం వస్తే పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యానికి అడ్డుకట్టవేసి, యుద్ధ ప్రాతిపదికన అప్రోచ్‌రోడ్డు పనులను పూర్తిచేయాలని ఈ ప్రాంత ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.


వంతెన వద్ద మట్టి కుప్పలు

**త్వరలోనే పనులు పూర్తి చేయిస్తాం...**
**-ఆర్అండ్‌బి ఏఈ సమీ**
ఈ విషయమై ఆర్అండ్‌బి ఏఈ సమీని వివరణ కోరగా.. వంతెన అప్రోచ్‌రోడ్డు పనులను త్వరగా పూర్తిచేయిస్తామని చెప్పారు. వర్షాకాలం దృష్ట్యా వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా పనులను వేగవంతంచేయాలని, వెంటనే పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు తగిన సూచనలు జారీచేస్తామని ఆయన స్పష్టంచేశారు.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

-నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి


ఆమనగల్లులో విలేకరులతో మాట్లాడుతున్న ఎంపి మల్లు రవి

**ఆమనగల్లు, జూన్ 13, ప్రభాతవార్త:**
భారతరాజ్యాంగాన్ని కాలరాస్తూ అధికార దాహంతో కేంద్ర ప్రభుత్వం దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అడ్డదారులు తొక్కుతుందని నాగర్ కర్నూల్ పార్లమెంట్‌సభ్యుడు మల్లు రవి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సంఘంతో కుమ్మక్కై కాంగ్రెస్‌నాయకురాలు మీనాక్షీనటరాజన్ రాజ్యసభకు దాఖలుచేసిన నామినేషన్ పత్రాలను తిరస్కరించిందని ఆరోపించారు. ఆమనగల్లు మండల కేంద్రంలో శనివారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, నిబంధనల ప్రకారం ఉన్న దరఖాస్తును కావాలనే రాజకీయ కక్షతో తిరస్కరించారని మండిపడ్డారు. ఎక్కడాలేని నిబంధనలను తెరపైకి తీసుకువచ్చి ఆపేరుతో నామినేషన్ తిరస్కరించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఇది కచ్చితంగా సీట్‌చోరీయే అని ఎంపి మల్లు రవి అభివర్ణించారు. ప్రస్తుతం దేశంలో బడాబాబులకు ఒకచట్టం, రాజ్యాంగంకోసం పోరాడేవారికి మరొకచట్టం అమలవుతుందని ఆయన ఘాటుగా విమర్శించారు. నటరాజన్ నామినేషన్ తిరస్కరణ ముమ్మాటికీ బిజెపి నియంతృత్వ పోకడలకు నిదర్శమని విమర్శించారు. ప్రతిపక్ష నేతల గొంతునొక్కడం వారి అజెండాగా ఎంపి పేర్కొన్నారు. దేశంలో బిజెపి తన స్వార్థప్రయోజనాలకోసం రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందన్నారు. సర్ పేరిట అర్హులైన ఓటర్లను తొలగించేందుకు కుట్రలు చేస్తుందని ఆయన ప్రస్తావించారు. ఓట్ల తొలగింపుతోనే పశ్చిమబెంగాల్‌లో బిజెపి అధికారంలోకి వచ్చిందని, అదే విధానాన్ని తెలంగాణలో అవలంబించేందుకు కేంద్రప్రభుత్వం పన్నాగాలు పన్నిందని విమర్శించారు. తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండి బిజెపి కుట్రలను తిప్పికొట్టాలని మల్లు రవి పిలుపునిచ్చారు. ఈ నియంత పాలనకు ప్రజలే బుద్ధిచెబుతారని వ్యాఖ్యానించారు. బిజెపి అవలంబిస్తున్న అడ్డదారులను అడ్డుకునేందుకు కాంగ్రెస్‌పార్టీ ఎప్పటికప్పుడు సంసిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన ప్రజాభిమానం పొందుతుందన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. కేంద్రప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తెలంగాణకు అన్యాయం చేస్తుందని, రాష్ట్రానికి రావలసిన ప్రాజెక్టులు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకొంటున్నదని అన్నారు. దేశంలోని ఎన్డీఎ పాలన రాష్ట్రాలకు ఒకమాదిరిగా, ప్రతిపక్ష రాష్ట్రాలకు మరోమాదిరిగా ఉందన్నారు. 12ఏళ్ల కాలంలో కేంద్రం తెలంగాణకు ఏమిచ్చిందో ప్రజలకు జవాబుచెప్పాలని డిమాండ్‌చేశారు. తెలంగాణలో పదేళ్ళు పాలించిన బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని ఎద్దేవాచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో తెలంగాణ రాష్ట్రం ఎంతో ప్రగతి సాధించిందని, ప్రజాభిమానం పొందుతున్న కాంగ్రెస్‌పార్టీ మరోపదేళ్ళ పాటు అధికారంలో ఉంటుందని ఎంపి మల్లు రవి ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు నేనావత్ పత్యానాయక్, మండలపార్టీ అధ్యక్షుడు తెల్గమళ్ళ జగన్, పట్టణాధ్యక్షుడు వస్పుల మానయ్య, సర్పంచ్ మండ్లి రాములు, కాలె మల్లయ్య, హరిలాల్, యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, గుండ్రాతి కుమార్‌గౌడ్‌లు ఉన్నారు.

# శంషాబాద్‌లో దంచికొట్టిన వాన

-భారీగా రోడ్లపై నిలిచిన నీరు -ట్రాఫిక్ క్లియర్ చేసిన ట్రాఫిక్ ఎసిపి నాగభూషణ్


జలమయమైన రోడ్లు దృశ్యం


ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్న ఎసిపి నాగభూషణ్

**రంగారెడ్డి అర్బన్, జూన్ 13, ప్రభాతవార్త:**
శంషాబాద్ మండలంలో శనివారం భారీవర్షం దంచికొట్టింది. దీంతో నేషనల్ హైవేపై సముద్రంలాగా నీరు నిలవడంతో వాహనదారులు, వ్యాపారస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలుషాపుల్లోని సెల్లార్‌ల్లోకి నీళ్లపోవడంతో డిఆర్ఎస్ సిబ్బంది అప్రమత్తమై మోటర్ సహాయంతో నీటిని తొలగించారు. ట్రాఫిక్ ఎసిపి నాగభూషణ్ ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అనంతరం ఎసిపి మాట్లాడుతూ.. భారీవర్షం పడడంతో నీరు ఒకేసారిగా రోడ్డు మీదకురావడంతో ట్రాఫిక్ ఇబ్బంది ఏర్పడిందని, వెంటనే ట్రాఫిక్‌ను క్లియర్ చేశామని, వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రోడ్లమీదకురావొద్దని సూచించారు. ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నామని సూచించారు. షాప్‌లముందు నీరు నిల్వకుండా ఉండేందుకు ఈసమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎసిపి నాగభూషణ్ పేర్కొన్నారు.

# మాజీమంత్రికే వెన్నుపోటు పొడిచిన నాగేందర్

శాసన సభ్యులు కాలె యాదయ్య

**చేవెళ్ల, జూన్ 13, ప్రభాతవార్త:**
మీరు, మీసతీమణి నవాబ్‌పేట్ ఎంపిపిగా పనిచేశారు. జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్‌గా, రాష్ట్ర విద్యా మౌలికవసతుల సంస్థ చైర్మన్‌గా పదవులు వెలగబెట్టావ్. చేరదీసి రాజకీయ భిక్షపెట్టిన మాజీమంత్రి ఎ.చంద్రశేఖర్‌కు వెన్నుపోటు పొడిచావ్. ఎన్నోపదవులు అనుభవించినా స్వంతగ్రామానికి రోడ్డు వేసుకోలేని నాగేందర్‌గౌడ్ ఓచెల్లని రూపాయ్‌లాంటివాడని చేవెళ్ల శాసనసభ్యులు కాలె యాదయ్య ధ్వజమెత్తారు. మూలమడ ఘటనపై నాగేందర్‌గౌడ్, దేశమళ్ల ఆంజనేయులు చేసిన ఆరోపణలను యాదయ్య తీవ్రంగా ఆక్షేపించారు. శనివారం చేవెళ్ల మున్సిపల్‌కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానికనేతలతో కలిసి ఎమ్మెల్యే యాదయ్య విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగేందర్‌గౌడ్ నీది ధృతరాష్ట్రకౌగిలి, పీనుగులపై బొంగులు ఏరుకునే రకం. అలాంటివి నీవు నాపై తప్పుడు ఆరోపణలు చేస్తావా. ఖబడ్దార్ మరోమారు అర్థరహిత ఆరోపణలుచేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి నాగేందర్ గౌడ్ అండ్ టీం తప్పుడు సమాచారమిచ్చారని అన్నారు.

**దోపిడీ, హత్యారాజకీయం నీది.,**
తెదేపాలో ఉన్నన్నాళ్లు పక్కా ఇళ్లు ఇప్పిస్తానని డబ్బులు వసూల్‌చేశావ్. రాష్ట్ర ఉద్యమసమయంలో అందినకాడికిదోపిడీ. రోడ్లువేయకుండానే బిల్లులు లేపిన నీసంగతి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజలందరికీ తెలుసని విరుచుకుపడ్డారు. 1988లో ఓ హత్య. 2001-02లో అత్తాపూర్ గ్రామంలో బాణామతి పేరుతో ఓవ్యక్తిని చెట్టుకు కట్టేసి హత్యచేసిన రాజకీయ చరిత్ర నీదని మండిపడ్డారు. అభివృద్ధి నా అజెండా, నా మంత్రం. నియోజకవర్గ అభివృద్ధిపై బహిరంగచర్చకు సిద్ధం. సమయం, స్థలం ప్రకటించాలని నాగేందర్‌గౌడ్‌కు ఎమ్మెల్యే యాదయ్య ప్రతిసవాల్ విసిరారు. సమావేశంలో డిసిసి ఉపాధ్యక్షులు బండారి ఆగిరెడ్డి, చేవెళ్ల పిఎసిఎస్ చైర్మన్ దేవర వెంకట్రెడ్డి, కౌన్సిలర్లు మద్దెల శ్రీనివాస్, కృష్ణనాయక్, గుడిమల్కాపూర్ మార్కెట్‌కమిటీ మాజీడైరెక్టర్ ఎం.యాదగిరి, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్, నాయకులు భూర్ల మహేష్ పాల్గొన్నారు.

## మండల వ్యవసాయ అధికారి సస్పెండ్

**దుద్యాల్, జూన్ 13, ప్రభాతవార్త:**
దుద్యాల్ మండల వ్యవసాయ అధికారి నాగరాజును సస్పెండ్ చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం తెలిపారు. గత రబీ సీజన్లో మండలంలో వేరుశనగ విత్తనాల పంపిణీలో అవకతవకలు జరిగినట్లు పలు వార్తాపత్రికలలో కథనాలు రావడంతో వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆదేశాలతో క్షేత్రస్థాయిలో విచారణనిర్వహించి పథకం అమలులో కొన్నిలోపాలు గుర్తించడం జరిగిందన్నారు. దీనికి బాధ్యులను చేస్తూ కలెక్టర్ సిఫార్సుతో వ్యవసాయ శాఖ డైరెక్టర్ దుద్యాల్ ఏవో నాగరాజును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు జిల్లా వ్యవసాయ అధికారి రాజారత్నం తెలిపారు.

## బైక్ ప్రమాదంతో దెబ్బతిన్న ఉపాధి

**పెద్దేముల్, జూన్ 13, ప్రభాతవార్త:**
ఒక సాధారణ రోడ్డు ప్రమాదం ఓ యువకుడి జీవితాన్ని అనూహ్య మలుపు తిప్పిందని బాధిత కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రమాదవశాత్తు జరిగిన ఘటనలో సరైనవిచారణ లేకుండానే హత్యాయత్నం కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపడంతో పోస్టల్‌శాఖ ఉద్యోగ ఇంటర్వ్యూను కోల్పోయి భవిషత్తు అంధకారంలో పడిందని వారు వాపోతున్నారు. ఈ ఘటనపై పెద్దేముల్ ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్ వ్యవహారశైలిపై విచారణ జరిపించాలని బాధితుడి తండ్రి జిల్లా ఎస్పికి ఫిర్యాదు చేశారు. మంబాపూర్ గ్రామానికి చెందిన మర్పల్లి శ్రీనివాస్ కుమారుడు అనిర్వేష్ ఈ నెల 2న గ్రామంలో స్కూటీపై వెళుతుండగా వెనుకనుంచి వచ్చిన బుల్లెట్, మోటారు సైకిల్‌ను ఢీ కొట్టిందని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఇద్దరూ కిందపడగా, బుల్లెట్ నడుపుతున్న జాఫర్ చేతికి ఫ్రాక్చర్ అయినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై జాఫర్ సోదరుడు మోహిజ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, సంఘటనపై సమగ్ర విచారణ, సాక్ష్యాల పరిశీలన చేపట్టకుండా అనిర్వేష్‌పై హత్యాయత్నం కేసు నమోదుచేసి ఈ నెల 8న రిమాండ్‌కు పంపించారని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఇది ఉద్దేశపూర్వకంగా జరిగిన ఘటనకాదని, సాధారణ రోడ్డు ప్రమాదమేనని వివరించినా, పోలీసులు పట్టించుకోలేదని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. రిమాండ్ కారణంగా ఈ నెల 9న జరగాల్సిన పోస్టల్‌శాఖ ఉద్యోగ ఇంటర్వ్యూకు అనిర్వేష్ హాజరు కాలేకపోయాడని, దీంతో అతని ఉద్యోగ అవకాశంతోపాటు విద్యాభవిషత్తు కూడా దెబ్బతిందని కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తంచేశారు.

ఒక కేసు కారణంగా యువకుడి జీవితమే అనిశ్చితిలో పడిందని కన్నీటిపర్యంతమయ్యారు. మరోవైపు గాయపడిన జాఫర్ ఫిర్యాదు దారుడు మోహిజ్, వారి కుటుంబసభ్యులు కూడా ఇది ప్రమాదవశాత్తు జరిగిన ఘటన మాత్రమేనని, ఎలాంటి ఉద్దేశపూర్వకచర్య కాదని చెబుతున్నారని బాధితుడి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. అవసరమైతే వారిని కూడా అధికారుల ఎదుట హాజరుపరచడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో కేసు నమోదు విధానం, దర్యాప్తు, రిమాండ్ ప్రక్రియపై నిష్పాక్షికంగా విచారణ జరిపి, విధి నిర్వహణలో లోపాలు లేదా అధికార దుర్వినియోగం జరిగినట్లు తేలితే సంబంధిత అధికారిపై శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పిని మర్పల్లి శ్రీనివాస్ కోరారు.

**పెద్దేముల్ ఎస్ఐ వివరణ:**
ఈ విషయమై పెద్దేముల్ ఎస్ఐ ప్రశాంత్‌వర్ధన్‌ను వివరణ కోరగా, ఫిర్యాదు దారుడు రాతపూర్వకంగా ఇచ్చిన ఫిర్యాదుమేరకే కేసు నమోదుచేశామని, అందుకు తమవద్ద ఆధారాలు ఉన్నాయని తెలిపారు.

## కెసిఆర్‌ను కలిసిన వంటేరు ప్రతాప్‌రెడ్డి



**మర్కుక్, జూన్ 13 (ప్రభాతవార్త):** ఎఫ్‌డిసి మాజీ చైర్మన్, బిఆర్‌ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి శనివారం మాజీ సిఎం కెసిఆర్‌ను కుటుంబ సమేతంగా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కెసిఆర్ ఆశీర్వాదం తీసుకొని ఆయనతో కొద్దిసేపు ఆప్యాయంగా ముచ్చటించినట్లు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. అంతకు ముందు గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రతాప్‌రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న కృషిని కొనియాడారు. ఆయనతో పాటు ప్రతాప్‌రెడ్డి తనయుడు మాజీ సర్పంచ్ విజయేందర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు ఉన్నారు.

## స్టేట్ ర్యాంక్ సాధించిన విద్యార్థిని సన్మానం

**గజ్వేల్, జూన్ 13 (ప్రభాతవార్త):**

పట్టణానికి చెందిన చెప్యాల శేఖర్ కూతురు చెప్యాల అక్షర ఇంటర్మీడియెట్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో ర్యాంక్ సాధించడం పట్ల శనివారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యలో మరింత ఉన్నతంగా ఎదగాలని,ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో ర్యాంక్ సాధించడం పట్ల విద్యార్థినికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొంత కాలంగా గజ్వేల్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు వెంకటనర్సయ్య అనారోగ్యంతో బాధపడు తున్న విషయం తెలుసుకుని అక్కడికివెళ్లి ఆయన యోగక్షేమాలు తెలుసుకు న్నారు. ఆయన వెంట ఏఎంసి వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, పిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, నాయకులు గాడిపల్లి శ్రీనివాస్, గుంటుకు శ్రీను, సుఖేందర్‌రెడ్డి, పూజారి శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

## వైభవంగా శని త్రయోదశి మహోత్సవం

**వర్గల్, జూన్ 13(ప్రభాతవార్త):**

వర్గల్ శ్రీవిద్యాధరి క్షేత్రంలో శని త్రయో దశి మహోత్సవం వైభవంగా జరిగింది. శనివారం తెల్లవారుజామున ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేదపండితులు శ్రీశనీశ్వర భగవానుడికి ప్రత్యేక పూజలు, తైలాభి షేకాలు, అర్చనలు నిర్వహించి మహోత్సవానికి అంకురార్పణ చేశారు. అనంతరం విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారికి తిల, తైలాభిషేకం నిర్వహించగా, కుంభ, మీన, మేష, ధనుస్సు, సింహ రాశుల వారు తైలాభిషేకంతో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు మహా ప్రసాదం అందజేశారు. అలాగే విద్యాధరి, లక్ష్మీ గణపతి, కళ్యాణ వెంకటేశ్వర, సుబ్ర హ్మణ్య, చంద్రమౌళీశ్వర, శ్రీ శంభులింగేశ్వర క్షేత్రాలు భక్తులతో కిటకిట లాడగా, అమ్మవారి నామస్మరణతో శంభుగిరులు మార్మోగాయి.



ఫారెస్ట్ క్లీన్ అండ్ డ్రైవ్‌లో పాల్గొన్న లక్ష్మిరాజుయాదవ్, బుచ్చేష్‌యాదవ్

## ప్లాస్టిక్ రహిత నర్సాపూర్‌ను చేయడం లక్ష్యం

### మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్

**నర్సాపూర్, జూన్ 13, ప్రభాతవార్త :** ప్లాస్టిక్ రహిత నర్సాపూర్‌ను చేయడమే లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ మాచునూరి లక్ష్మీరాజు యాదవ్, వైస్ చైర్మన్ బుచేష్‌యాదవ్ అన్నారు. శనివారం స్వాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నర్సాపూర్ అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ క్లీన్ అండ్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. స్వాన్ ఫౌండేషన్ ప్రతినిధి మేఘన మునునూరి మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ సందర్భంగా వారు ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నర్సాపూర్ అటవీ ప్రాంతంలోఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి పరిశుభ్రం చేశారు అనంతరం పట్టణంలో భారీ అవగాహన ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో ఉపాధ్యాయులు, ప్రజలు పాల్గొని అడవిని కాపాడుదాం పర్యావరణాన్ని పరిరక్షిద్దాం... ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ రాజు యాదవ్, ఫ్వాన్ ఫౌండేషన్ ప్రతినిధి మేఘన మునునూరిలతో పాటు స్వాన్ ఫౌండేషన్ సభ్యులు వాకింగ్ సభ్యులు పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

### మంబాపూర్ అటవీ ప్రాంతంలో భారీ క్లీనప్ డ్రైవ్

**గుమ్మడిదల, జూన్ 13 (ప్రభాతవార్త):** మండలపరిధిలోని మంబాపూర్ అటవీ ప్రాంతంలో ప్రకృతి, అడవుల పరిరక్షణ లక్ష్యంగా 'స్వాన్' (సేవ్ వాటర్ అండ్ నేచర్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం భారీ క్లీనప్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు కొనసాగిన ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద కార్యకర్తలు అటవీ ప్రాంతంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా మార్చారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ, అడవుల సంరక్షణపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు కళాకారులతో నుక్కడ్ నాటక్(వీధి నాటకం) ప్రదర్శించారు. ఈ సందర్భంగా స్వాన్ సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ, అడవులు ప్రకృతి సంపదకు మూలమని, వాటి పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. మనమందరం కలిసికట్టుగా కృషి చేస్తేనే అడవులను పచ్చగా, పరిశుభ్రంగా ఉంచుకోగలం, రాబోయేతరాలకు పచ్చని భవిష్యత్తును అందించడమే మా లక్ష్యం' అని తెలిపారు. కార్యక్రమంలో స్వాన్ సంస్థ సభ్యులు, పర్యావరణ ప్రేమికులు, స్థానిక యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ నీటి హక్కులను కాపాడాలి

### ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం



మాట్లాడుతున్న నరోత్తం

**జహీరాబాద్ జూన్ 13 ప్రభాతవార్త :** తెలంగాణ నీటి హక్కులను కాపాడి, జహీరాబాద్ నియోజకవర్గంలోని అన్ని చెరువుల కింద ఆయకట్టుకు నిరంధించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై నరోత్తం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం "నీళ్లు, నిధులు, నియామకాలు" అనే ప్రధాన నినాదాలపై సాగిందని. నీటి హక్కుల పరిరక్షణ. కృష్ణా, గోదావరి నదులు తెలంగాణ గుండా ప్రవహిస్తున్నప్పటికీ రాష్ట్రానికి సరైన వాట దక్కడం లేదన్నారు. గోదావరి నదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మిస్తున్న బనకచర్ల – కావేరి లింక్ ప్రాజెక్టు వల్ల తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర నష్టం కలిగే ప్రమాదం ఉందన్నారు. గోదావరి నదిలో 213 టీఎంసీలు, కృష్ణా నదిలో 90 టీఎంసీల తెలంగాణ రాష్ట్రానికి దక్కాల్సి ఉండగా ఈ ప్రాజెక్టు వల్ల నీటి వినియోగ అవకాశాలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. నీటి విషయంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం నిరక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. జహీరాబాద్ నియోజకవర్గం కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో విస్తరించి ఉండగా ఇక్కడ 76 సాగునీటి చెరువులు వాటి ఆయకట్టు 12,265 ఎకరాలు. ప్రస్తుతం కేవలం 2,935 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతుందని మిగతా ఆయకట్టు నిరుపయోగంగా మారిందన్నారు. నియోజకవర్గంలో చెరువుల నిర్వహణ కోసం జహీరాబాద్‌లో ఒక ఇరిగేషన్ డివిజన్ ఏర్పాటు చేయగా 1 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, 4 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, 12 ఏఈ/ఏఈఈలు, 30 మంది సాంకేతిక సిబ్బంది, 15 మంది పరిపాలనా సిబ్బంది పనిచేస్తున్నారన్నారు. వీరి నిర్వహణకు సంవత్సరానికి కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న కాలువలు, చెరువుల, నీటి పంపిణీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంవల్ల ఆయకట్టు విస్తరణ జరగడంలేదన్నారు. ప్రభుత్వం వెంటనే చెరువుల మరమ్మతులు చేపట్టి కాలువలను పునరుద్ధరించి కొత్త సాగునీటి పనులకు నిధులు మంజూరు చేయాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శివకుమార్,యస్.గోపాల్, యస్, వెంకట్, వీర్ శెట్టి,మేఘనా థ్,తదితరులు ఉన్నారు.

### నేడు ఓటర్ల జాబితా సవరణపై అవగాహన సదస్సు

### ఎమ్మెల్యే పటోళ్ల సంజీవరెడ్డి

**నారాయణఖేడ్, జూన్ 14 ప్రభాతవార్త :** ఓటర్ల జాబితా సవరణపై అవ గాహన కల్పించేందుకు నేడు(ఆదివారం) పట్టణంలో భారీ అవగాహన సద స్సును ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి తెలిపారు. ఏఐసీసీ, టిపిసిసి ఆదేశాల మేరకు.. నేడు ఉదయం 10 గంటలకు నారా యణఖేడ్‌లోని జీవన్ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ స్థాయి సదస్సు నిర్వ హించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జహీరాబాద్ ఎంపి సురేష్‌కుమార్ శెట్కర్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ సచిన్ సావంత్, జిల్లా ఇన్‌చార్జ్, రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫయీమ్, ముఖ్యశిక్షకులు రాజీవ్ పాల్గొని, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై, బూత్‌స్థాయి ఏజెంట్లు అనుసరించాల్సి న వ్యూహా లపై దిశానిర్దేశం చేయనున్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, బూత్‌లెవెల్ ఏజెంట్లు, సర్పంచులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు (మాజీ ప్రజాప్రతినిధులతోసహా) కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల ప్రజా ప్రతినిధులు, యువ నాయకులు సదస్సుకు హాజరై, సవరణ ప్రక్రియకు సంబంధించిన సాంకేతిక, చట్టపరమైన అంశాలను తెలుసుకొని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.





ప్రారంభానికి సిద్ధమైన కొమురవెల్లి రైల్వేస్టేషన్





స్టేషన్‌లో నిర్మించిన భవనం

## ప్రారంభానికి సిద్ధమైన కొమురవెల్లి రైల్వేస్టేషన్

### మల్లన్నస్వామిని దర్శించుకునే భక్తులకు నేరుగా రైలు ప్రయాణ సౌకర్యం

**కొమురవెల్లి, జూన్ 13, ప్రభాతవార్త :**

తెలంగాణలోని ప్రసిద్ధ కొమురవెల్లి మల్లన్న స్వామి ఆలయాన్ని సందర్శించే భక్తులకు మెరుగైన రవాణా సౌకర్యాన్ని అందించడంతోపాటు కనెక్టివిటీని పెంచడానికి రూ.5.63 నిర్మించిన కొమురవెల్లి పుణ్య క్షేత్రం రైల్వే స్టేషన్ ప్రారంభానికి సిద్ధమైంది. ఇప్పటికే రైల్వేస్టేషన్‌లో అన్ని పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేశారు. ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో నిర్మితమైన ఈ కొత్త రైల్వే స్టేషన్.. తెలంగాణలో ప్రాంతీయ కనెక్టివిటీని బలోపేతం చేయడమే కాకుండా ప్రయాణీకుల సౌకర్యాన్ని పెంచుతుంది. స్థానిక సంస్కృతి ఉట్టిపడేలా స్టేషన్ భవనంతోపాటు హై-లెవల్ ప్యాసింజర్ ప్లాట్‌ఫామ్ (450మీటర్ల పొడవు, 10 మీటర్ల వెడల్పుతో ఏర్పాటు చేశారు. టికెట్ బుకింగ్ కౌంటర్లు, సర్క్యులేటింగ్ ఏరియా, పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేశారు. మల్లన్న స్వామి ఇక్కడి ప్రకృతి జంతువులను ప్రతిబింబించేలా గోడలపై అందమైన చిత్రాలను వేశారు. ప్లాట్‌ఫామ్‌పై తాగునీటి సదుపాయం, మహిళలు, పురుషులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించారు. ప్రసిద్ధ కొమురవెల్లి మల్లన్న స్వామిని దర్శించుకునే భక్తులకు నేరుగా రైలు ప్రయాణ సౌకర్యం ఏర్పాటు కానుంది. ఇతర ప్రాంతాలతో రవాణా అనుసంధానం మెరుగుకానుంది. ఆధ్యాత్మిక పర్యాటకానికి,స్థానిక ఆర్థిక అభివృద్ధికి ఎంతగానో దోహదం చేయనుంది.

## రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న బిజెపి

### -నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను తిరస్కరించడం సిగ్గుచేటు.. సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి

**గజ్వేల్, జూన్ 13 (ప్రభాతవార్త):**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేయడమే కాకుండా సీటు చోరీకి దిగజారినట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు తూంకుంట ఆంక్షరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డిలు విమర్శించారు. శనివారం గజ్వేల్ పట్టణంలో ఇందిరాపార్కు చౌరస్తా వద్ద ప్రధాని నరేంద్ర మోడి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఇంతకాలం ఓటు చోరీకిపాల్పడి బిజెపి అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారం కోసం ఓటు చోరీకి కూడా వెనుకాడలేదని బిజెపిపై మండిపడ్డారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని నిర్వీర్యం చేసే క్రమంలో అగ్రనేతలపై అక్రమ కేసులు నమోదు చేయిస్తున్నారని, చివరకు గాంధేయవాది మీనాక్షి నటరాజన్‌కు రాజ్యసభ సభ్యత్వం దక్కకుండా కుట్రలు చేసినట్లు విమర్శించారు. ఎలాంటి కేసులు లేనప్పటికీ బిజెపి నేతల ఫిర్యాదుతో నామినేషన్ పత్రాలను తిరస్కరించడం సిగ్గుచేటని నిలదీశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ దేశాన్ని అప్పులపాలుచేసిన ప్రధాని నరేంద్ర మోడికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రధాని మోడికి భవిష్యత్తులో అదే గతి పడుతుందని హెచ్చరించారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ కులమతాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతున్న బిజెపి అసలు నైజాన్ని గమనించాలని సూచించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అభివృద్ధికి అడ్డు తగులుతున్న బిజెపి నేతలను ప్రజలు నిలదీయాలని ఈ సందర్భంగా కోరారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడం, సాగుకు సరిపడా ఎరువులు సరఫరా చేయకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక కృషితో రైతులను ఆదుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్‌రెడ్డి, విజయ మోహన్, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, పిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, జిల్లా మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు సమీర్, మాజీ డిసిసి ఉపాధ్యక్షుడు గుంటుకు శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు సుఖేందర్‌రెడ్డి, కనకయ్య, జంగం రమేష్‌గౌడ్, ఏఎంసి డైరెక్టర్ డాక్టర్ వాహిద్, గాడిపల్లి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజార్, పూజారి శ్రావణ్‌కుమార్, కొండపోచమ్మ డైరెక్టర్ గుండు మల్లేశం, అక్కారం యాదగిరి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## జహీరాబాద్‌కు బుల్లెట్ ట్రైన్ వచ్చేవరకు పోరాటం చేస్తాం

### ఆల్ పార్టీ సమావేశంలో ఎమ్మెల్యే మాణిక్ రావు





మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్యరావు

**జహీరాబాద్, జూన్ 13 ప్రభాతవార్త**

జహీరాబాద్‌కు గతంలో మంజూరైన హైదరాబాద్ ముంబై బుల్లెట్ ట్రైన్‌ను జహీరాబాద్ మీదుగా మళ్లించే వరకు అన్ని రాజకీయ పార్టీలతో కలిసి బుల్లెట్ ట్రైన్ సాధన ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ సమావేశం మందిరంలో అన్ని రాజకీయ పార్టీలతో కలిసి ఏర్పాటుచేసిన ఆల్‌పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జహీరాబాద్ నియోజకవర్గం పారిశ్రామికగా విద్యాపరంగా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో జహీరాబాద్ మంజూరైన హైదరాబాద్ ముంబై బుల్లెట్ ట్రైన్ కొన్ని స్వార్థ శక్తులు జహీరాబాద్‌కు రాకుండగా మరో మార్గంలో తీసుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అందుకు డిపిఆర్‌ను సిద్ధం చేసినట్లు సమాచారం అందిందని, జహీరాబాద్‌కు మంజూరైన బుల్లెట్ ట్రైన్ ఎట్టి పరిస్థితుల్లో ఇతర ప్రాంతాల మీదుగా వెళ్లకుండా అడ్డుకుంటామన్నారు. జహీరాబాద్‌లో ప్రతిష్టాత్మకమైన నిమ్జ్‌లో ఇంటిగ్రేటెడ్ ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు అవుతున్న తరుణంలో బుల్లెట్ ట్రైన్ జహీరాబాద్ మీదుగా కాకుండా ఇతర ప్రాంతాల మీదుగా తరలించడం అన్యాయమన్నారు. ఈ విషయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, విద్యావంతులు వ్యాపార వ్యక్తులతో కలిసి బుల్లెట్ ట్రైన్ సాధన ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. రాబోయే రోజులలో జహీరాబాద్ బందు రాస్తారోకో తదితర కార్యక్రమాలు నిర్వహించి కేంద్ర ప్రభుత్వంపై పెద్దఎత్తున ఒత్తిడి తెస్తామని చెప్పారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, రైల్వే అధికారులు వెంటనే స్పందించి జహీరాబాద్ మీదుగా హైదరాబాద్ ముంబై బుల్లెట్ ట్రైన్ నడిచే విధంగా డిపిఆర్‌లు సిద్ధం ముంబై బుల్లెట్ ట్రైన్ నడిచే విధంగా డిపిఆర్‌లు సిద్ధం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నాయకులతో కలిసి రైల్వే స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి స్టేషన్ మాస్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. సమావేశంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎం.శివకుమార్, జి.గుండప్ప,మాజీ మున్సిపల్ చైర్మన్ అల్లాడి నరసింహులు, నీల వెంకటేశం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ ఎస్ ఉజ్వల్ రెడ్డి, కండెం నరసింహులు, నరసింహారెడ్డి, బిజెపి నాయకులు గొల్ల భాస్కర్, సుభాష్‌రెడ్డి, విజేందర్ రెడ్డి, వివిధ సంఘాల నాయకులు రాజశేఖర సెట్‌కార్, శంకర్ పాటిల్, అయూబ్, జ్యోతి అండాల్, తులసి రామ్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కా రాములు





శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న చుక్కా రాములు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

సమాజ మార్పునకు కమ్యూనిస్టులు అత్యంత అవసరమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కా రాములు అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్మిక భవనంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా, కార్మిక, రైతు సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం పోరాటాలకు సన్నద్ధమవుతుందని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా నేడు ఆర్థిక సంక్షోభంతో కూరుకుపోయిన నేపథ్యంలో తమ మార్కెట్ల ఆధిపత్యం కోసం అమెరికా తీవ్రమైన ప్రయత్నం చేస్తుందని దానికి ప్రత్యామ్నాయం కమ్యూనిజం నిలబడిందని అందుకు చైనా ఉదాహరణ అన్నారు. సమాజ మార్పుకు కమ్యూనిజం తప్పనిసరి పరిస్థితి ఏర్పడుతుందన్నారు. నాటి నుంచి నేటి వరకు అనేక అంశాలపై పోరాటాలు నిర్వహించి ప్రత్యామ్నాయ మార్గాలు చూపింది ఎర్రజెండా కమ్యూనిజమేనని గుర్తు చేశారు. నేడు సమాజంలో ఉన్న అసమానతలు పారదోలాలన్నా ప్రజలందరికీ సమాన పనికి సమాన వేతనంతో పాటు సుఖవంతమైన జీవితాన్ని అందించడం కోసం కమ్యూనిస్టు పార్టీ కృషి చేస్తుందన్నారు. సీపీఎం నాయకులు బండారు రమేష్ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర తరగతులను బోధించారు. అలాగే పిట్టల రవి తరగతులను బోధించారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా ప్రతినిధులు రాళ్లబండి శశిధర్, అముదాల మల్లారెడ్డి, గోపాల స్వామి, ఎల్లయ్య, సత్తిరెడ్డి, భాస్కర్, అరుణ్ కుమార్, కృష్ణారెడ్డి, యాదగిరి, రవికుమార్, బాల నర్సయ్య, రవీందర్, శిరీష, ప్రజా సంఘాల బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.



యూరియా స్టాక్‌ను పరిశీలిస్తున్న తూంకుంట నర్సారెడ్డి

## రైతులకు యూరియాను అందుబాటులో ఉంచాలి

**గజ్వేల్, జూన్ 13 (ప్రభాతవార్త):** రైతులకు సరిపడా యూరియాను అందుబాటులో ఉంచాలని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అధికారులకు సూచించారు. శనివారం పట్టణంలో ఉన్న యూరియా స్టాక్‌ను పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ రైతులకు ఎలాంటి యూరియా కొరత లేకుండా యూరియాను సకాలంలో అందించాలని సూచించారు. సిఎం రేవంత్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, పిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి నక్క రాములుగౌడ్, సీనియర్ నాయకులు గాడిపల్లి శ్రీనివాస్, గుంటుకు శ్రీను, సుఖేందర్‌రెడ్డి, పూజారి శ్రావణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



అభరణాలు చూపుతున్న బాధిత మహిళ

## బంగారం మెరిపిస్తామని మోసం

### 8 గ్రాములు కాజేసిన కేటుగాళ్లు

**తొగుట, జూన్ 13,ప్రభాతవార్త :** బంగారు అభరణాలను కొత్తవాటిలా మెరిపిస్తామని నమ్మబలికి మహిళలను మోసం చేస్తున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో శనివారం ఇద్దరు యువకులు ఈ తరహా మోసానికి పాల్పడిన ఘటన వెలుగులోకి వచ్చింది. గ్రామంలోని పలువురు ఇళ్లకు వెళ్లిన ఇద్దరు వ్యక్తులు తమ వద్ద ఉన్న ప్రత్యేక పౌడర్, లిక్విడ్‌తో బంగారం, వెండి అభరణాలను తెల్లగా చేసి మెరిపిస్తామని చెప్పారు. చాలామంది వారి మాటలను నమ్మలేదు. చివరకు గ్రామానికి చెందిన కళ్లెపు అనూష ఇంటికి వెళ్లిన వారు ముందుగా ఆమె చేతులపై పౌడర్ వేసి నమ్మకం కల్పించారు. ఆ తర్వాత అనూష మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడు, ఆమె చెల్లి కాళ్లలో ఉన్న వెండి పట్ట గొలుసులను తీసుకొని శుభ్రం చేస్తామని చెప్పారు. ఏదో రసాయన ద్రావణంలో వాటిని ముంచి కొంత సేపటి తర్వాత తిరిగి ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే అభరణాల బరువు తక్కువగా ఉన్నట్లు గమనించిన బాధితులు స్థానిక బంగారు దుకాణంలో తూకం వేయించగా సుమారు 8 గ్రాముల బంగారం కరిగించి కాజేసినట్లు గుర్తించారు. దీంతో మోసపోయామని తెలుసుకున్న వారు కన్నీరుమున్నీరయ్యారు. అపరిచితులు ఇంటికి వచ్చి అభరణాలు మెరిపిస్తామని, శుభ్రం చేస్తామని చెప్పినా ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని పోలీసులు సూచిస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న తొగుట పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. మహిళలు అప్రమత్తంగా ఉండి విలువైన అభరణాలను అపరిచితుల చేతికి ఇవ్వవద్దని పోలీసులు సూచించారు.

### వైకుంఠ రథం టైర్ల చోరీ





టైర్లు చోరీకి గురైన వైకుంఠరథం

**మర్కుక్, జూన్ 13 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాములపర్తి గ్రామ శివారులో పార్కింగ్ చేసి ఉంచిన వైకుంఠ రథం(బొలెరో) వాహనానికి సంబంధించిన టైర్లను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో అంత్యక్రియల సేవల కోసం ఉపయోగపడే వాహనానికి సంబంధించిన టైర్లు చోరీచేయడం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేసింది. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## స్థలం విషయంలో అన్నపై తమ్ముడి దాడి

### -రిమాండ్‌కు తరలించిన పోలీసులు

**రాయపోల్, జూన్ 13 (ప్రభాతవార్త):** మండలంలోని వడ్డేపల్లి గ్రామంలో ఇంటి స్థల వివాదం కుటుంబ కలహానికి దారితీసింది. గ్రామానికి చెందిన తిప్పగొని మహేష్‌గౌడ్(36) తమ్ముడు తిప్పగొని శ్రీకాంత్(28) మధ్య కొంతకాలంగా ఇంటి స్థలానికి సంబంధించిన వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో మే 29న ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకోగా, ఆగ్రహానికి గురైన శ్రీకాంత్ కట్టెతో మహేష్‌పై దాడి చేసినట్లు సమాచారం. ఈ ఘటనలో మహేష్ తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స పొందాడు. బాధితుడు మహేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతరం నిందితుడు శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరచగా, కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు రాయపోల్ ఎస్ఐ మానస తెలిపారు.



వివరాలు తెలుపుతున్న రాయపోల్ ఎస్ఐ మానస

# అక్రమ కూల్చివేతలు రియల్ వ్యాపారుల కోసమే..!

**-కక్షసాధింపు రాజకీయాలకు అధికారుల అండ..**
**-రోడ్డు విస్తరణ పేరుతో అక్రమ కూల్చివేతలు అమానుషం..**
**-మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం**



కూల్చివేతలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం

**మొయినాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** రోడ్డు విస్తరణ పేరుతో నోటీసులు ఇవ్వకుండా పేదలు, రైతుల ఇళ్లను కూల్చివేయడం అమానుషమని, ఇదిముమ్మాటికీ కక్షసాధింపుచర్యేనని మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం తీవ్రంగా ఆరోపించారు. మొయినాబాద్ మండల పరిధిలోని కనకమామిడి గ్రామం నుంచి వెంకటాపూర్‌కు వెళ్లే రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో శుక్రవారం రెవెన్యూ అధికారులు పంచాయతీ పాలకవర్గంతో కలిసి రోడ్డుపక్కన ఉన్న కొన్నినిర్మాణాలను తొలగించారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం సంఘటనాస్థలానికి చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే చట్టపరమైన నిబంధనలను తుంగలో తొక్కి నిరుపేదల ఇళ్లను కూల్చివేయడం సమంజసం కాదన్నారు. ముందుగా పూర్తిస్థాయి సర్వేనిర్వహించి, సంబంధిత భూయజమానులకు నోటీసులు జారీచేసి, వారి అభ్యంతరాలు స్వీకరించిన తరువాతే చర్యలు చేపట్టాలని సూచించారు. కాని అలాంటివేమీ చేయకుండా ఆగమేఘాల మీద జెసిబిలతో వచ్చి కూల్చివేతలకు పాల్పడటం అధికారుల ఏకపక్షధోరణికి నిదర్శనమని విమర్శించారు. పేదలు, రైతులపై కఠినంగా వ్యవహరించే రెవెన్యూ అధికారులు వందలకోట్ల రూపాయల విలువైన ప్రభుత్వభూములను ఆక్రమించినవారిపై ఎందుకు చర్యలుతీసుకోవడం లేదని ప్రశ్నించారు. పేదవాడు గోరంత ప్రభుత్వభూమిని ఆక్రమించినా పెద్ద ఎత్తున హడావిడిచేసే అధికారులు, కనకమామిడిరెవెన్యూలోని 510,511సర్వేనెంబర్లలో పెద్ద ఎత్తున అక్రమకబ్జాలకు పాల్పడుతున్నవారిపై మాత్రం మౌనం పాటించడం వెనుక కారణమేంటని నిలదీశారు. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారుల ప్రయోజనాలకోసం ఈ కూల్చివేతలు నిర్వహిస్తున్నారనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఈభూములవిషయంలో కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ, వాటిని పట్టించుకోకుండా అధికారులు వ్యవహరించడం సరికాదన్నారు. ఈ చర్యలను వెంటనే నిలిపివేసి, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు. రైతులహక్కులను కాపాడేందుకు బిజెపి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, అవసరమైతే ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు బాధిత కుటుంబాలను పరామర్శించినవారిలో శ్రీరామ్‌నగర్ మాజీసర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, బిజెపి మండలపార్టీ అధ్యక్షుడు దారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, అడ్వకేట్ మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అంజిరెడ్డి, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

**ప్రభుత్వభూముల కబ్జాలపై చర్యలు ఎందుకు లేవు?: మర్రి రవీందర్‌రెడ్డి**

ఈసందర్భంగా కాంగ్రెస్ మండలపార్టీ ఉపాధ్యక్షుడు మర్రి రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ, గ్రామ పరిధిలోని వందలకోట్లరూపాయల విలువైన ప్రభుత్వ భూములు అక్రమకబ్జాలకు గురయ్యాయని తాము పలుమార్లు తహసీల్దార్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదులు చేశామని, ఉన్నతాధికారులు సైతం చర్యలుతీసుకోవాలని సూచించినప్పటికీ, మండల స్థాయి అధికారులు వాటిని పట్టించుకోలేదని ఆరోపించారు. అక్రమకబ్జాలపై చర్యలుతీసుకోలేని అధికారులు రోడ్డువిస్తరణ పేరుతో పేదల ఇళ్లపై విరుచుకు పడటం విచారకరమన్నారు. రెవెన్యూ అధికారుల వ్యవహారశైలిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్‌చేశారు.

**హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేశారు: అడ్వకేట్ రవీందర్‌రెడ్డి**

అడ్వకేట్ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ, భూములకు సంబంధించిన అంశం హైకోర్టుపరిధిలో ఉండగా, కోర్టు ఉత్తర్వులను చూపించినప్పటికీ అధికారులు వాటిని పట్టించుకోలేదన్నారు. నన్నెవరూ ఆపలేరు అన్న ధోరణిలో తహసీల్దార్ వ్యవహరించారని విమర్శించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కైన కొందరు అధికారులు వారి ప్రయోజనాల కోసం వ్యవహరిస్తున్నారనే అనుమానాలు బలపడుతున్నాయని, కూల్చివేతలను అడ్డుకునేందుకు ప్రయత్నించిన బాధితులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినా అధికారులు కనికరంచూపలేదని ఆరోపించారు. ఫామ్‌హౌస్ యజమానులు, రియల్ వ్యాపారులు, కొందరు అధికారుల మధ్య ఉన్న సంబంధాలపై సమగ్రవిచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

**మహిళా సర్పంచ్ ఎక్కడ..?**

బాధిత కుటుంబాలవారు మాట్లాడుతూ తాము 20 నుంచి 30 సంవత్సరాలుగా అక్కడే నివాసం ఉంటున్నామని, గ్రామంలోని రాజకీయ కక్షల కారణంగానే తమ ఇళ్లను లక్ష్యంగాచేసుకుని కూల్చివేతలు నిర్వహించారని ఆరోపించారు. సర్పంచ్‌భర్త, ఆయన అనుచరులు రెవెన్యూ అధికారులతో కలిసి ఈచర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. గ్రామానికి మహిళాసర్పంచ్ ఉన్నా, ఇప్పటివరకు ఆమె సంఘటనాస్థలానికి రాకపోవడం బాధాకరమన్నారు. గ్రామపాలన మహిళాసర్పంచ్ చేతుల్లో ఉందా, లేక ఆమెభర్త చేతుల్లో ఉందా అనే విషయాన్ని అధికారులు స్పష్టంచేయాలనికోరారు. ఈ విషయంలో జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని తమకు న్యాయంచేయాలని వేడుకున్నారు.

**నోటీసులు ఇచ్చిన తర్వాతే చర్యలు: తహసీల్దార్ గౌతమ్‌కుమార్**

ఆరోపణలపై తహసీల్దార్ గౌతమ్‌కుమార్ స్పందిస్తూ, కనకమామిడినుంచి వెంకటాపూర్‌వెళ్లే రహదారి విస్తరణకోసం పూర్తిస్థాయి సర్వే నిర్వహించినట్లు తెలిపారు. సర్వేకు ముందుగానే సంబంధిత వ్యక్తులకు నోటీసులు అందజేశామని చెప్పారు. సర్వే అనంతరం రహదారి వెడల్పు ప్రకారం ఉన్న ఆక్రమణలను మాత్రమే తొలగించామని వివరించారు. మొదట 60అడుగుల వెడల్పు వరకు పరిశీలించినప్పటికీ, ఆధికారికనక్షాల ప్రకారం 33అడుగుల మేర రహదారిహద్దులు ఉన్నట్లు గుర్తించామని, అందుకే ఆమేరకు నిర్మాణాలను తొలగించామని తెలిపారు. కూల్చివేతల సమయంలో కొందరు బాధితులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడటంతో చర్యలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడం, ప్రజాప్రయోజనాలను కాపాడడమే తమలక్ష్యమని, ఇందులో ఎలాంటి వ్యక్తిగత ద్వేషం లేదా రాజకీయ ఉద్దేశం లేదని స్పష్టంచేశారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా చట్టబద్ధంగానే చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.

## ప్రజలభాగస్వామ్యంతోనే ప్రభుత్వ బడులు బలోపేతం

**-సర్పంచ్ న్యాలపట్ల నరేందర్‌రెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచు నరేందర్‌రెడ్డి

**ఆమనగల్లు, జూన్ 13, ప్రభాతవార్త:** ప్రభుత్వ బడుల ద్వారా ప్రభుత్వం నాణ్యమైన విద్యనందిస్తుందని, ప్రజలు విశ్వాసం ఉంచి వాటిని వినియోగించుకుంటే ఎటువంటి ఆర్థిక సమస్యలకు గురికాకుండా విద్యార్థుల ఆశయాలు, అనుకున్న లక్ష్యాలను అధిగమించవచ్చని ఆకుతోటపల్లి సర్పంచు న్యాలపట్ల నరేందర్‌రెడ్డి, ఆమనగల్లు మండల విద్యాధికారి పగిడిపాల పాండు అన్నారు. ప్రభుత్వ బడులు బలోపేతం కావాలంటే విధిగా ప్రజలు భాగస్వామ్యులుగా వ్యవహరించాలని వారు సూచించారు. ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సర్పంచు న్యాలపట్ల నరేందర్‌రెడ్డి అధ్యక్షతన శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. సమ్మేళనంలో 1976 నుండి 2026 విద్యాసంవత్సరం వరకు చదివిన పదవతరగతి పూర్వ విద్యార్థులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వివిధప్రాంతాలలో స్థిరపడిన వీరంతా సమ్మేళనంలో కలుసుకుని పాఠశాలలో తమకున్న మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసి శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచు ఒర్సు శ్రీనివాసులు, హెచ్‌ఎంలు చందులాల్, చిలుకమ్మ, మాజీసర్పంచ్ రామచంద్రయ్య, ప్రమోద్‌కుమార్, మాజీ ఎంపీటీసీ రాములు, అండేకర్ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

## అర్ధశతాబ్దపు జ్ఞాపకాల వేదికగా జడ్పీహెచ్‌ఎస్ ఘనంగా ఉపాధ్యాయులకు సన్మానం

**షాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** షాబాద్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో వివిధ కాలాల్లో చదువుకున్న సుమారు 2,500నుంచి 3,000మంది పూర్వవిద్యార్థులు ఒకేచోట చేరి నిర్వహించిన మహాసమ్మేళనంలో 1970ల నుంచి నేటివరకు దాదాపు 50బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులు హాజరై వారి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో గతంలో సేవలందించిన, ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు రంగచారి, వీరస్వామి, కుమారస్వామి, ఏగూరి లింగప్ప, యాదగిరాచారి, హిందూమతి, శ్రీనివాసరావు, రాఘవేంద్రరావు, శ్రీదేవి, సుదర్శన్, రామ్‌రెడ్డి, జగదీశ్వర్, లింగం, సుశీల తదితరులను పూర్వవిద్యార్థులు శాలువాలుకప్పి, జ్ఞాపికలు అందజేసి కృతజ్ఞతాభివందనాలతో ఘనంగా సన్మానించారు. సమ్మేళనాన్ని పూర్వవిద్యార్థులు కొండా విజయ్‌కుమార్, బొబ్బిలి ప్రవీణ్ తదితరులు సమన్వయంచేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు, వారి కుటుంబసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత ఫిజియోథెరపీకి స్పందన

**మేడ్చల్, జూన్ 13. ప్రభాతవార్త:** గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలోని గౌడవెల్లి గ్రామంలోగల సాకేత్ ప్రణామం వెల్‌నెస్ హబ్‌లో శనివారం నిర్వహించిన ఉచిత ఫిజియోథెరపీ, ఫాల్ స్క్రీనింగ్ శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. మొబిలిటీ ఇండియా హైదరాబాద్ (ఎఐహెచ్), సాకేత్ ప్రణామమ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈశిబిరంలో 110మంది నివాసితులు పాల్గొని వైద్య సేవలను ఉపయోగించుకున్నారు. ఈకార్యక్రమంలో సాకేత్ ప్రణామం అసోసియేషన్ అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, కార్యదర్శి వల్లభేంద్రరెడ్డి, సీనియర్ న్యాయవాది శేషయ్య, బాలసుబ్రహ్మణ్యం, జనవిజ్ఞాన వేదిక నాయకుడు వరప్రసాదరావు, క్యాంపు నిర్వాహకులు డాక్టర్ సామరాజురెడ్డి, కన్వీనర్ శేషసాయి, మొబిలిటీ ఇండియా హైదరాబాద్, నిమ్స్ ఆస్పత్రుల వైద్య నిపుణులు డాక్టర్ సామరాజురెడ్డి, సీనియర్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ఎం.వర్షిత, డాక్టర్ సోఫియా సుల్తానా, డాక్టర్ నవీన్‌కుమార్‌నాయక్, డాక్టర్ సౌమ్య, టెక్నీషియన్ శాంతి, కన్వీనర్లు శేషసాయి, ప్రసాదరావు, కాలనీ నివాసితులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులు ఆందోళన చెందకండి

**-మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు**



కొనుగోలుకేంద్రాన్ని సందర్శించిన ఆంజనేయులుముదిరాజ్

**కుల్కచర్ల, జూన్ 13, ప్రభాతవార్త:** రైతులు ఎవ్వరూ ఆందోళన చెందకూడదని చివరి గింజవరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులుముదిరాజ్ పేర్కొన్నారు. శనివారం మండలపరిధిలోని ముజాహిద్‌పూర్‌గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని రైతులతో కలిసి ఆయన సందర్శించారు. ఈసందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు మాట్లాడుతూ... అకాలవర్షాల కారణంగా తడిసిన ధాన్యం ప్రభుత్వమే కొంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని ఆయన అన్నారు.

## పోలీసు స్టేషన్‌ను సందర్శించిన డిఎస్పీ



రికార్డులను పరిశీలిస్తున్న వికారాబాద్ డిఎస్పీ అంజయ్య

**కోట్‌పల్లి, జూన్ 13, ప్రభాతవార్త;** రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని వికారాబాద్ జిల్లా డిఎస్పీ అంజయ్య అన్నారు. శనివారం వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి పోలీసు స్టేషన్‌లో అయన సందర్శించి పలు రికార్డులను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. రోడ్డు సేఫ్టీ నిబంధనలు, హెల్మెట్ వినియోగం, కారులో సీట్‌బెల్ట్ ధరించడం, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల కలిగే నష్టాలపై వాహనదారులకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రతిరోజు వాహన తనిఖీలు నిర్వహించి డ్రంకెన్‌డ్రైవ్ కార్యక్రమాలు మరింత కట్టుదిట్టంగా అమలు చేయాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై శైలజ, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీపై మినికిట్ల పంపిణీ

**-దౌల్తాబాద్ మండల వ్యవసాయ అధికారిణి లావణ్య**

**దౌల్తాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** దౌల్తాబాద్ మండలంలోని రైతులకు ఎన్ఎఫ్ఎస్ఎమ్-ఎమ్ఎఎన్ఎఫ్ పథకం కింద 100శాతం సబ్సిడీపై కంది, పెసర విత్తన మినికిట్లను పంపిణీ చేయనున్నట్లు దౌల్తాబాద్ మండల వ్యవసాయ అధికారిణి(ఎఓ) లావణ్య ఒక ప్రకటనలో తెలిపారు. మండలకోటా కింద మొత్తం 1000 కంది మినికిట్లు, 200 పెసర మినికిట్లతో పాటు 48 కేజీల రైజోనియం జీవ ఎరువులను రైతులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈపథకం కింద రైతులకు అధిక దిగుబడినిచ్చే విశిష్టమైన పెసరవిత్తనాలను సరఫరాచేస్తున్నట్లు వెల్లడించారు.

**ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారుల ఎంపిక...**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారుల ఎంపికలో రిజర్వేషన్లను అమలు చేయనున్నట్లు వ్యవసాయ అధికారిణి తెలిపారు. ఇందులో భాగంగా ఎస్సీ సామాజికవర్గానికి చెందిన రైతులకు 15.45 శాతం, ఎస్టీ వర్గానికి చెందిన రైతులకు 9.08 శాతం విత్తనాలను, వీటితోపాటు మొత్తం విత్తనాలలో 30 శాతాన్ని మహిళారైతులకు కేటాయించనున్నట్లు ఆమె వివరించారు. విత్తనాల పంపిణీకి సంబంధించి ప్రత్యేక కార్యాచరణను రూపొందించినట్లు ఎఓ లావణ్య తెలిపారు. రాబోయే మంగళవారంనుండి ఆయాక్లస్టర్ల పరిధిలో విత్తనాల పంపిణీప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ పంపిణీ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె ఈ సందర్భంగా కోరారు.

## మండల ఉపసర్పంచుల ఫోరం కమిటీ ఎన్నిక

**తలకొండపల్లి, జూన్ 13, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండలంలో నూతనంగా ఉపసర్పంచుల ఫోరం కమిటీని ఏకగ్రీవంగా ఎంపికచేశారు. శనివారం మండల కేంద్రంలో మండలంలోని 32 గ్రామ పంచాయతీల ఉపసర్పంచులు అందరూ కలిసి మండల ఉపసర్పంచుల ఫోరం కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా పెద్దూర్ తండా ఉపసర్పంచ్ మూడవత్ భాస్కర్‌నాయక్, ఉపాధ్యక్షులుగా రాంపూర్ గ్రామానికి చెందిన సప్పిడి ఆంజనేయులు, ప్రధానకార్యదర్శిగా వెల్జాలకు చెందిన విజయలక్ష్మి, జైన్ సెక్రెటరీగా చుక్కాపూర్‌గ్రామానికి చెందిన లావణ్య, కోశాధికారిగా గోపినాయక్‌తోపాటు మరికొంతమంది కమిటీసభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు భాస్కర్‌నాయక్ మాట్లాడుతూ ఉపసర్పంచుల సమస్యలపై ప్రభుత్వంతో పోరాడి సాధించుకునేందుకు ప్రయత్నంచేస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఆయాగ్రామాల ఉపసర్పంచులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

**-గ్రామ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యేకు వినతి**



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

**తలకొండపల్లి జూన్ 13, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండలపరిధిలోని గట్టుప్పలపల్లి గ్రామానికి అభివృద్ధి పనులకై నిధులు మంజూరు చేయాలని కోరుతూ శనివారం సర్పంచ్ చంద్రశేఖర్ కల్పుట్టి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. హైదరాబాదులోని ఎమ్మెల్యే ఇంటివద్ద వారు కలిసి గ్రామంలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం, అండర్ డ్రైనేజీ, సిసిరోడ్లు, గ్రామపంచాయతీ భవనం తదితర పనులకు నిధులు మంజూరుచేయాలని వారు వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రశేఖర్, వార్డుసభ్యులు రేణురెడ్డి, మాజీ ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్, అశోక్, కోల శీను, గ్రామస్థులు తదితరులున్నారు.

## బాలసాహిత్యానికి విలువైన కానుక బాలపంచపదుల బాలరామాయణం



బాలపంచపదుల బాలరామాయణం పుస్తక ఆవిష్కరణ చేస్తున్న దృశ్యం

**కొత్తూరు, జూన్ 13, ప్రభాతవార్త;** హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో శనివారం కొత్తూరు మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖకవి అక్కి నర్సింలుగౌడ్ రచించిన బాలపంచపదుల బాలరామాయణం పుస్తకావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. పంచపదుల ప్రక్రియ సృష్టికర్త ప్రముఖకవి కాటేగార్ పాండురంగ విఠల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఘంటా మనోహర్‌రెడ్డి తదితరులు పుస్తకాన్ని ఆవిష్కరించి రచయిత అక్కి నర్సింలుగౌడ్‌ను అభినందించారు. ఈ సాహిత్య సభకు పలువురు ప్రముఖులు, కవులు, సాహితీ అభిమానులు హాజరయ్యారు. కసిరెడ్డి వెంకట్‌రెడ్డి చేతులమీదుగా పుస్తకావిష్కరణ జరగడం విశేషం. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బాలలకు రామాయణసారాన్ని సులభంగా అర్థమయ్యేలా పంచపదుల రూపంలో అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. తెలుగు సాహిత్యానికి, ముఖ్యంగా బాలసాహిత్యానికి ఈ రచన ఒక విలువైన కానుకగా నిలుస్తుందని కొనియాడారు. కార్యక్రమంలో దైవజ్ఞశర్మ, కోగంటి ఉషారాణి, బుక్కపట్నం రమాదేవి, కట్టా శ్యామల తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## అమెరికాలో హత్యకు గురైన యువకుడి అంత్యక్రియలు

**మేడ్చల్, జూన్ 13. ప్రభాతవార్త:** ఆమెరికాలో దుండగులచేతిలో కాల్పులకు మృతిచెందిన మేడ్చల్ మండలం, గుండ్లపోచంపల్లి నివాసి అన్షుల్ అంత్యక్రియలు శనివారం నిర్వహించారు. గుండ్లపోచంపల్లికి చెందిన కూచ శ్రీనివాస్‌గౌడ్, నీలిమ దంపతుల కొడుకు అన్షుల్ (28) ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి, చదువుతోపాటు సొంత ఖర్చుల కోసం ఫిలడెల్ఫియాలోని రిడ్జ్ ఎవెన్యూ ప్రాంతంలోని పిజ్జా షాప్‌లో పార్ట్‌టైమ్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తుండేవాడు. పదిరోజుల క్రితం శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత నార్త్ ఫిలడెల్ఫియాలోని రేమండ్ రోసెన్ హోమ్స్ పబ్లిక్ హౌసింగ్ కాంప్లెక్స్ వద్దకు పిజ్జా తీసుకెళ్లిన అతనిని అప్పటికే అక్కడ మాటువేసిన దుండగులు తుపాకీతో కాల్చిచంపిన విషయం విదితమే. కాగా, అతని మృతదేహన్ని శుక్రవారం ఇంటికి తీసుకురాగా, శనివారం నగరంలోని తిరుమలగిరి శ్మశానవాటికలో అంత్యక్రియలు జరిపారు.

## మృతుని కుటుంబసభ్యులను పరామర్శించిన మాజీ ఎంపిపి

**తలకొండపల్లి, జూన్ 13, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండలపరిధిలోని వెల్జాల్‌గ్రామానికిచెందిన మొగిలిశెట్టి పెద్దయ్య అనేవ్యక్తి ఇటీవల మృతిచెందాడు. శనివారం మృతుని కుటుంబసభ్యులను తలకొండపల్లి మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ పరామర్శించి పెద్దయ్యలేని లోటు వారి కుటుంబానికి పూడ్చలేనిదని తెలిపారు. అనంతరం వ్యక్తిగతంగా వారి కుటుంబసభ్యులకు 3000 రూపాయలు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ నుంచి 3000 రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్, వెల్జాల్ సర్పంచ్ వానరాశి రాములమ్మ, వెంకటేష్, కోఆప్షన్ సభ్యులు రెహమాన్, గ్రామస్థులు విష్ణు, రవి, నరసింహ తదితరులు ఉన్నారు.

## బంట్వారం ఠాణాను తనిఖీ చేసిన డిఎస్పీ

**బంట్వారం, జూన్ 13, ప్రభాతవార్త:** బంటారంమండల పోలీస్‌స్టేషన్‌ను శనివారం వికారాబాద్ డిఎస్పీ అంజయ్య ఆకస్మికంగా తనిఖీచేశారు. ముందుగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి, వివిధ అంశాలపై స్థానిక ఎస్సై విమలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తులను పిలిపించి వారిప్రవర్తన గురించి ఆరాతీశారు. సమాజంలో బాధ్యతాయుతంగా, మంచి ప్రవర్తనతో ఉండాలని వారికి సూచించారు. ఈసందర్భంగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను గుర్తించి, బాధితులకు తిరిగి అందజేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని డిఎస్పీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై విమలతోపాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో సిసి కెమెరాలు చాలా అవసరం



దేవాలయంలో సిసి కెమెరాలను ప్రారంభిస్తున్న సిఐ ఆంజనేయులు

**కీసర, జూన్ 13, ప్రభాతవార్త:** నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు చాలా అవసరమని కీసర సిఐ అర్కపల్లి ఆంజనేయులు అన్నారు. శనివారం కీసర సర్కిల్ పరిధిలోని కీసర శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో దాత ప్రముఖ న్యాయవాది, మేడ్చల్ జిల్లా జూనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వంగేటి బాపిరెడ్డి సహకారంతో ఏర్పాటుచేసిన సీసీ టివి కెమెరాలను ప్రారంభించారు. అనంతరం దేవాలయకమిటీ సభ్యులు దాత బాపిరెడ్డి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో రామాలయం చైర్మన్ రాయిల శ్రావణ్‌కుమార్‌గుప్తా, ఎస్ఐ హరిప్రసాద్, భక్తమండలి సభ్యులు తంగళ్లపల్లి వెంకటేష్, జూపల్లి రవీందర్, మెట్టు మహేందర్‌యాదవ్, పండుగ రామక్రిష్ణ, మదూరి రవీందర్, తటాకం భానుశర్మ, మెట్టు సతీష్, బండారు శ్రీనివాస్‌రెడ్డి, చినింగణి సుధాకర్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వాస్పత్రిని సందర్శించిన సిపిఎం నాయకులు



మేడ్చల్ ఆస్పత్రిని సందర్శించిన సిపిఎం నాయకులు

**మేడ్చల్, జూన్ 13. ప్రభాతవార్త:** మేడ్చల్ పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సిపిఎం నాయకులు శనివారం సందర్శించి పరిశీలించారు. ఈసందర్భంగా పార్టీ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎ.అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రిలో సరైన వైద్య సౌకర్యాలు లేకపోవడంతో పేషెంట్లు తగ్గుతున్నారని సరైన సదుపాయాలను వెంటనే ప్రభుత్వం జోక్యంచేసుకొని కల్పించాలని డిమాండ్‌చేశారు. ఆస్పత్రి నుండి వెళ్లిపోయిన డాక్టర్ల స్థానంలో నూతనవైద్యులను నియమించకపోవడంతో సమస్య ఏర్పడుతున్నదని, వెంటనే వైద్యుల ఖాళీలను భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రి అంటేనే ప్రజలు భయపడే పద్ధతిలో ప్రభుత్వం పనిచేస్తున్నదని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలని డిమాండ్‌చేశారు. ఈకార్యక్రమంలో సిపిఎంపార్టీ మేడ్చల్ మండల కార్యదర్శి నరేష్, నాయకులు రమేష్, నర్సింగ్‌రావు, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## గోకఫస్లావాద్ ఏఈఓను సర్వీస్ నుండి తొలగింపు

**దౌల్తాబాద్, జూన్ 13, ప్రభాతవార్త:** దౌల్తాబాద్ మండలంలో వేరుశనగ విత్తనాల పంపిణీలో జరిగిన అక్రమాలు, విధుల్లో నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులు కఠినచర్యలు చేపట్టారు. విత్తనాల పంపిణీలో జరిగిన అక్రమాలపై రైతులనుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు గురువారం మండలంలోని గోకఫస్లావాద్, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో రంగంలోకిదిగి పై అధికారుల ఆదేశాలతో ఎంపీడీఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు రైతుల ఇళ్లకు వెళ్లి నేరుగా వివరాలు సేకరించారు. ప్రభుత్వం 50శాతం సబ్సిడీపై పంపిణీచేయాల్సిన విత్తనాల విషయంలో వ్యవసాయ అధికారులు అక్రమాలకు పాల్పడినట్లు రైతులు ఆరోపించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో దాదాపు 90శాతానికి పైగా రైతులకు అసలు విత్తనాలే అందలేదని వెల్లడైంది. ఈవిచారణకు సంబంధించిన పూర్తివివరాలతో కూడిన సమగ్రనివేదికను పంచాయతీ కార్యదర్శులు ఉన్నతాధికారులకు అందజేయడంతో పథకాల అమలులో లోపాలు ఉన్నట్లు తేలడంతో, కలెక్టర్ దీపక్ తివారి ఆదేశాలమేరకు గోకఫస్లావాద్ క్లస్టర్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్(ఏఈఓ) మమతను సర్వీసు నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

## వ్యవసాయ కార్మికసంఘం మహాసభలను జయప్రదం చేయండి

**-షాద్‌నగర్ డివిజన్ కన్వీనర్ శ్రీనునాయక్ పిలుపు**

**షాద్‌నగర్, జూన్ 13, ప్రభాతవార్త:** తెలంగాణ వ్యవసాయకార్మికసంఘం రంగారెడ్డిజిల్లా 12వ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం షాద్‌నగర్ డివిజన్ కన్వీనర్ శ్రీనునాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదలచేశారు. మహాసభలు జూన్ 14న షాద్‌నగర్ పట్టణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని వ్యవసాయ కార్మికులు, సంఘ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున మహాసభలకు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# అన్నదాతల ఆర్తనాదాలు వినిపించకూడదు

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



రైతు వేదికలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, హాజరైన రైతులు

**నందిగామ, జూన్ 13, ప్రభాతవార్త:** వ్యవసాయ రంగంలో ఎరువుల పంపిణీ కోసం ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన డీఏపీ యాప్ విధానంతో రైతులు, ఫెర్టిలైజర్‌వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనిపై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. రంగారెడ్డి జిల్లా నందిగామలో జరిగిన సమీక్షాసమావేశంలో రైతుశాఖ ఉన్నతాధికారుల సమావేశంలో ఆయన పాల్గొని రైతుల సమస్యలపై గళమెత్తారు. సమావేశంలో ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. రైతులు పంటలకు ఎంత మోతాదులో ఎరువులు వాడాలో సరైన శాస్త్రీయ అవగాహనలేకుండా వాడుతున్నారని పేర్కొన్నారు. గతంలో యూరియా దొరకదేమోననే వదంతులతో రైతులు భయాందోళనలకు గురై, పది బస్తాలు అవసరమయ్యే చోట ఇరవై బస్తాలు కొనుగోలుచేసి నిల్వచేసుకునేవారని గుర్తుచేశారు. ఈక్రమంలో యూరియాపంపిణీకి యాప్ విధానం తీసుకురావడంతో ఆసమస్య చాలావరకు పరిష్కారమైందని ఆయన తెలిపారు. అదేతరహాలోనే ఇప్పుడు పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న డీఏపీ యాప్‌లో అనేక సాంకేతికలోపాలు తలెత్తుతున్నాయని ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రంగారెడ్డి జిల్లా పట్టణప్రాంతానికి దగ్గరగా ఉన్నప్పటికీ, సామాన్యరైతులకు స్మార్ట్‌ఫోన్ వినియోగం, యాప్‌ద్వారా ఎరువుల వివరాలు నమోదు చేయడంపై ఇంకా పూర్తిస్థాయి అవగాహన రాలేదని స్పష్టంచేశారు. విధానాలు రూపొందించే అధికారుల అంచనాలకు, క్షేత్రస్థాయిలో సామాన్యులు పడుతున్న ఇబ్బందులకు వ్యత్యాసం ఉందన్నారు. రాబోయే సీజన్‌నాటికి ఈయాప్ ఇబ్బందులను అధిగమించడానికి వ్యవసాయ అధికారులు దృష్టిసారించాలని ఎమ్మెల్యే శంకర్ సూచించారు. గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతిగ్రామంనుంచి ఇద్దరు, ముగ్గురు ఆదర్శ రైతులను ఎంపికచేసి, వారికి యాప్‌వినియోగంపై ముందుగా శిక్షణనిస్తే, వారు ఆయాగ్రామాల్లోని మిగతారైతులకు ఎరువుల కొనుగోలులో సహాయపడతారని ఆయన అధికారులకు పరిష్కారాన్ని సూచించారు. సమావేశంలో వ్యవసాయశాఖ అడిషనల్ డైరెక్టర్లు కె.విజయ్‌కుమార్, బి.నరసింహారావు, ఏడీఏలు మాధవి, సత్యంబాబు, ఏడీఎస్ శైలజతోపాటు రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ఉన్న ఏడీఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.